

# ఎన్.టి.ఆర్ పురాణ పాత్రలు

– డా. నందమూరి లక్ష్మీపార్వతి



డా.లక్ష్మీపార్వతిగారు డాక్టరేట్ కోసం సమర్పించిన సిద్ధాంతగ్రంథం **'ఎన్.టి. ఆర్ పురాణపాత్రలు - భారతీయ పురాణ సంప్రదాయం చలనచిత్ర శైలీకరణ'** నుంచి ఎంపిక చేయబడిన కొన్ని భాగాలు - కౌముది పాఠకులకోసం ప్రత్యేకం..!!

## (గత సంచిక తరువాయి)

**ఎల్.వి ప్రసాద్‌గారి** ఆల్బమ్‌లో రామారావుగారి ఫోటో చూసిన దగ్గరనుండి సుబ్బారావుగారు తను తీయబోయే 'పల్లెటూరి పిల్ల' కథానాయకుడుని నిశ్చయించుకున్నారు. ప్రసాదుగారు అభ్యంతరం పెట్టినా ఆయన వినలేదు. మొదటి టెస్టింగ్‌గా 'మనదేశం' చిత్రంలో చిన్నపాత్ర, సబ్‌ఇన్‌స్పెక్టర్ వేషం ఇచ్చారు. ఆ సన్నివేశం దేశభక్తుల్ని తరిమి కొట్టటం. ఆ పాత్రలో ఆయన పూర్తిగా లీనమై కెమెరాకు అందనంత దూరం గేటు బయటదాకా పాత్రధారుల్ని తరిమికొట్టి వచ్చారు. 'పల్లెటూరి పిల్ల'లో కథానాయకుడిగా వెయ్యినూటపదహార్లు పారితోషికం తీసుకున్నారు. ఆ షూటింగ్‌లో ఎద్దుతో పోట్లాడి చెయ్యి విరగ్గొట్టుకున్నారు. ఆ తర్వాత చాలా రోజుల వరకు సినిమాలు లేవు. పస్తులున్న రోజులు కూడా ఉన్నాయి. అటువంటి స్థితి చూసిన రామారావుగారు, ఆ తరువాత ఆయన లేకపోతే తెలుగు చిత్రపరిశ్రమ లేదనిపించే స్థితిని కేవలం కృషి మీద ఆధారపడి సాధించారు. ఆయన నటించిన ఎన్నో సినిమాలు బాక్సాఫీసు హిట్ అయ్యాయి. దాని వెనుక ప్రధాన కారణం ఆయన కృషి, పాత్రలో నిమగ్నమై నటించే విధానం. నటన కాదు, జీవిస్తున్నారనిపించేలా మెప్పించడం.

ఆయన నిత్యవిద్యార్థి. ఎన్ని పాత్రలు నటించినా ఎప్పటికప్పుడు కొత్త పాఠాలు చదువుతున్నట్టే జాగ్రత్త పడేవారు. ప్రతి స్క్రిప్ట్ తనే స్వయంగా చదువుకుని పాత్రల స్వభావాన్ని బాగా అర్థం చేసుకున్నాకే సెట్‌లో అడుగుపెట్టేవారు. షూటింగ్‌కు వచ్చాక సంభాషణలు చూసే పద్ధతికి ఆయన వ్యతిరేకం. మొదట్లో తీరికగా ఉండే సమయాల్లో అనేక షూటింగ్‌లకు హాజరై, ఆయా నటుల అభినయాన్ని, సంభాషణలు చెప్పే తీరును నిశితంగా పరికిస్తుండేవారు. ఇది 'ఎల్.వి.ప్రసాదుగారి సలహా మీద చేసాన'ని చెప్పారు - చాలా ఓపిగ్గా వేషాలకోసం నిరీక్షించారు. హెచ్.ఎమ్ రెడ్డిగారు తను తీయబోయే సినిమాలో కథానాయకుడి వేషం ఇస్తానంటే దాదాపు సంవత్సరం పాటు ఆయన చెప్పిన సమయానికి నిమిషం తేడాలేకుండా వెళ్ళి నిలబడేవారు. ఆయన చివరికి 'సంసారం' సినిమాలో నాయకపాత్ర ఇచ్చారు - ఆ సినిమా 1950లో విడుదలై పదకొండు సినిమాహాళ్ళలో వందరోజులాడింది. ఒకచోట 25 వారాలు ప్రదర్శించబడింది.

తరువాత ఎల్.వి.ప్రసాద్‌గారి దర్శకత్వంలో జానకి హీరోయిన్‌గా తీసిన 'షావుకారు' చిత్రం మంచి వసూళ్ళను, మంచిపేరు ప్రతిష్టలు తెచ్చిపెట్టాయి. జానకిగారికి అది తొలిచిత్రం. 'షావుకారు' పేరును ఇంటిపేరన్నట్లుగా తెచ్చిపెట్టింది.

రామారావుగారి అదృష్టం ఒక్కసారి తన్నుకు వచ్చింది. అందుకు ఉదాహరణ విజయావారు ఆయనను రెండు సంవత్సరాలపాటు నెలసరి జీతం మీద ఒప్పందంపై తీసుకుని అగ్రిమెంటు చేసుకోవడమే. ఆ కాలంలోనే తెలుగు సినిమారంగంలో హేమాహేమీలైన నలుగురు దర్శకులతో ఒకేసారి పెద ఎత్తున నాలుగు సినిమాల్ని ప్రారంభించారు. కె.వి.రెడ్డిగారి దర్శకత్వంలో 'పాతాళభైరవి', బి.ఎన్.రెడ్డిగారి దర్శకత్వంలో 'మల్లీశ్వరి', ఎల్.వి.ప్రసాద్‌గారి దర్శకత్వంలో'పెళ్ళిచేసి చూడు', కమలాకర కామేశ్వరరావుగారి దర్శకత్వంలో 'చంద్రహారం' ఇంచుమించు ఒకేసారి ప్రారంభమయ్యాయి. అన్నిటిలో కథానాయకుడు రామారావుగారే. నెలసరి జీతంతోపాటు ప్రతి చిత్రానికి అయిదువేల రూపాయల పారితోషికం. ఇన్నాళ్ళ కష్టం, శ్రమ ఒకదారికి వచ్చినట్లుంది. రెండవ సంవత్సరంలో నెలకు రు.750/- చొప్పున వేతనం, చిత్రానికి ఏడువేలు పారితోషికం లభించాయి. విజయావారితో కుదిరిన ఈ ఒప్పందం రామారావుగారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. వారికి చిత్రరంగంలో పదిలమైన స్థానాన్ని తెచ్చి పెట్టింది. "నేను ఒక మంచి నటుడిగా ఎదగటానికి ఎల్.వి.ప్రసాదు, బి.ఎన్.రెడ్డి, కె.విరెడ్డి, కమలాకర కామేశ్వరరావు, నాగిరెడ్డి - చక్రపాణి, పింగళి నాగేంద్రరావు, సముద్రాల - కొసరాజు, ఛాయా దర్శకులు మార్కస్ బార్‌ట్లే, ఏం.ఏ. రహ్మాన్, నృత్యదర్శకుడు సలీం గార్ల సహచర్యం ఎంతో తోడ్పడింద"ని అంటారు. వీరందరూ వయసులో రామారావుగారికన్నా పెద్దవారవటం వలన వారిపట్ల ఆయన గురుభావాన్ని చూపించేవారు. అంతంత మాత్రంగా నడుస్తున్న చలనచిత్ర పరిశ్రమను రామారావుగారి నాలుగు చిత్రాల విజయం ఒక్కసారి పతాక స్థాయిని తీసుకుని వెళ్ళిపోయింది. అంతకుముందు వేళ్ళపై లెక్కపెట్టగల చిత్రాలు ఏవో కొద్దిపాటి ఆధారంతో నిలిచాయి. కానీ వసూళ్ళ విషయంలో ఒక స్థాయినందుకోలేకపోయాయి. 1951 నుండి పరిస్థితే మారిపోయింది. పరిశ్రమకు, నిర్మాతలకు కనకవర్షం కురిసింది. రామారావుగారు నటించిన ప్రతి అయిదు చిత్రాలకు మూడు చిత్రాలు బాక్సాఫీసు రికార్డు సృష్టించాయి. పురాణ దేవతలకు కొత్త తేజంతో ప్రతిష్టించిన ఘనత వారిదే 1982 వరకు దాదాపు 300 సినిమాల్లో నటించి అనేక విజయాలు, శతదినోత్సవాలు, రజతోత్సవాలు ఘనంగా జరుపుకుని 'విశ్వవిఖ్యాత నట సార్వభౌమ', 'కళాప్రపూర్ణ', 'డాక్టర్', 'నటరత్న', 'కలియుగ రామకృష్ణ' మొదలైన ఎన్నో బిరుదులు సన్మానాలు పొంది తెలుగు తల్లి ముద్దుబిడ్డగా - రాయలసీమ దత్తపుత్రుడిగా శాశ్వత స్థానం సంపాదించుకున్నారు. నటించిన పాత్రలన్నీ సమాజానికి సందేశం అందించేవే. పేదవారికోసం పోరాటం సాగించినవే. వాటి స్ఫూర్తే ఆయన రాజకీయాల్లోకి వచ్చాక బలహీన వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టటానికి కారణమైంది. ఆయన జీవితంలో చూసిన కన్నీళ్ళే ప్రజల బాధలను అర్థం చేసుకుని, వారి గుండెల్లో శాశ్వత స్థానం పొందడానికి హేతువులయ్యాయి.

సినిమాల్లో బాగా నిలదొక్కుకోకముందు "థౌజండ్ లైట్స్" వద్ద (ఇది అప్పట్లో మద్రాసులోని ఒక ప్రసిద్ధమైన హోటలు. ఆ ప్రాంతానికి కూడా అదే వ్యవహారం వచ్చింది.) ఒక గది అద్దెకు తీసుకుని ఉన్న రోజుల్లో, యోగానంద్‌గారు, కొన్నాళ్ళు తాతినేని ప్రకాశరావుగారు కూడా వారితో ఉండేవారు. ఆ రోజుల్లో భోజనం 50 పైసలు. అది కూడా లేక మూడురోజులు పస్తులున్నారు. తర్వాత విషయం తెలిసి యోగానంద్‌గారు. 'మేము చచ్చిపోయామనుకున్నావా బ్రదర్?' అని కన్నీళ్ళతో అడిగినట్లు రామారావుగారు చెప్పారు. నిర్మాతల్ని, దర్శకుల్ని కలుసుకోవటానికి బస్సు ఛార్జీలకు కూడా డబ్బుల్లేక ఎంతదూరమైన కాలినడకన పోతుండేవారట. త్రివిక్రమరావుగారు కూడా వచ్చి అన్నతోనే ఉండిపోయారు.

పాతాళభైరవి సృష్టించిన సంచలనం అంతా ఇంతాకాదు. 34 థియేటర్లలో వందరోజులు, పదమూడు థియేటర్లలో 25 వారాలు, కొన్నిచోట్ల 50 వారాలు ఆడింది. ఆ సినిమాలో అమాయకుడు, అందగాడు, సాహసి అయిన తోటరాముడి పాత్రలో ఆయన ఎంతగా ఇమిడిపోయారంటే ఆ తరువాత కొద్దికాలం అందరూ ఆ పేరుతోనే ఆప్యాయంగా పిలిచేవారు. ఆ చిత్రం ఇప్పుడు విడుదలైనా

50రోజులు తక్కువ ఆడదు. ఆ చిత్రంతో నటుడిగా పూర్తిగా నిలదొక్కుకున్నారు. అది ముఖ్యంగా సాధారణం ప్రేక్షకుడిని ఎక్కువగా ఆకట్టుకుంది.

'మల్లీశ్వరి' చిత్రం కూడా అపూర్వ కళాఖండంగా తెలుగు వారి జ్ఞాపకాల్లో ఇప్పటికీ మిగిలిపోయింది. 'పెళ్ళిచేసి చూడు' కూడా విజయం సాధించటంతో ఆయన వెనక్కు తిరిగి చూసుకునే అవసరమే లేకపోయింది. 1953 అంతం వరకు దాదాపు 14 సినిమాల్లో నటించారు. కేవలం రెండు సంవత్సరాల్లో అన్ని సినిమాలు నటించడం మరెవరికీ సాధ్యంకాదనిపించారు. భార్యాబిడ్డలను తీసుకొచ్చి బజుల్లా రోడ్‌లో అద్దె ఇంటిలో కాపురం పెట్టారు.

'నేషనల్ ఆర్ట్ థియేటర్' బ్యానర్‌పై ఆయన తన సోదరుడు త్రివిక్రమరావుతో కలసి ఎన్నో సినిమాలు తీసారు. మొదటగా తీసిన 'పిచ్చిపుల్లయ్య'కు మంచిపేరు వచ్చింది. అవార్డు కూడా వచ్చింది. కానీ, డబ్బు రాలేదు. తరువాత తీసిన 'తోడు దొంగలు' పరిస్థితి కూడా అంతే - చాలా నష్టపోయారు. త్రివిక్రమరావు తిరిగి నిమ్మకూరు వెళ్ళి వ్యవసాయం చేసుకుంటానని చెబితే, ఆయనను వారించి మరో చిత్రం 'జయసింహ' తీయించి విజయం సాధించారు. అదే వారిలోని పట్టుదల. ఓటమి ఎదురయ్యే కొద్దీ మరింతగా పైకి లేవాలనుకుంటారు. బంతి కొట్టే కొద్దీ పైకి లేస్తుందన్న సామెత వారిపట్ల నిజం. తోడు దొంగలు ఆర్థికంగా విజయం సాధించలేకపోయినా 1954లో రాష్ట్రపతినుండి ఉత్తమ చిత్రంగా ప్రశంసలందుకుంది. ఆ రోజుల్లో ప్రేక్షక అభిరుచి సాంఘికాలపట్ల కంటే జానపదంపట్ల అని 'జయసింహ' విజయం చాటుతుంది. 'జయసింహ' జానపద చిత్రంలో హిందీనటి వహీదారెహమాన్ కథానాయికగా నటించారు - ఈ సినిమా పన్నెండు థియేటర్లలో వందరోజులు, ఒక థియేటర్‌లో రజతోత్సవం చేసుకుంది.

వ్యక్తిగతంగా మంచి క్రమశిక్షణ కలిగిన రామారావుగారు ఎన్నడూ వ్యసనాల జోలికి పోలేదు. సినిమా రంగప్రవేశానికి ముందు వారు కొన్నాళ్ళు విజయవాడలో పొగాకు వ్యాపారం చేసారు. ఆ సమయంలో చుట్టకాల్చటం బాగా అలవాటయింది. సినిమా హీరోకు పళ్ళు తెల్లగా అందంగా ఉండాలంటే చుట్టకాల్చకూడదని ఎల్.వి.ప్రసాద్‌గారు చెప్పారు. 'ఊటీలో షూటింగ్ కోసం వెళ్ళినప్పుడు తెల్లవారు ఝామున చలికి తట్టుకోలేక సరదాగా ఆరుబయట కూర్చుని చుట్టకాలుస్తుంటే చిన్నబాబు జయశంకర్ నిద్రలేచివచ్చి 'నాన్నగారూ! మీరు చుట్టకాలుస్తారా?' అని ఆశ్చర్యంగా అడిగాడట. అంత చిన్నపిల్లవాడి ముందు దోషిగా నిలబడినందుకు సిగ్గుపడుతూ చుట్ట అవతల పారేసి మళ్ళీ జీవితంలో ముట్టుకోలేదని చెప్పారు.

మద్యం రుచి కూడా వారికి తెలియదు. గాంధీగారు తల్లికిచ్చిన మాట ప్రకారం బారిష్టరు చదవటానికి వెళ్ళినప్పుడు విదేశాల్లో మద్యం, మాంసం ముట్టనట్టు రామారావుగారు కూడా ఉద్యోగం విడిచి మద్రాసు వెళ్ళేముందు తల్లి చెప్పిన మాట ప్రకారం జీవితకాలంలో ఎప్పుడూ మద్యం ముట్టలేదు. వెడుతూ తనకాళ్ళకు దండం పెడుతున్న కొడుకును "మద్రాసు సినిమారంగంలో అనేక ఆకర్షణలుంటాయి. వాటికి దూరంగా ఉండే బంగారు భవిష్యత్తు ఉంటుంది. అక్కడ మేమెవ్వరం ఉండం. నీకు నువ్వే బాధ్యత తెలుసుకుని నడుచుకో" - అని చెప్పిన మాటలు ఆయన ఎన్నడూ అతిక్రమించలేదు.

పల్లెటూరి పిల్ల షూటింగ్‌లో ఎద్దుతో యధార్థంగా పోరాటం చేసినప్పుడు అది ఎత్తి క్రిందపడవేసింది. శరీరం బరువంతా కుడిచేతిమీద మోపటంతో చెయ్యి ఎముకపూర్తిగా విరిగిపోయింది. నొప్పితో అల్లాడిపోతున్న రామారావుగారికి చిత్తూరు నాగయ్యగారు గ్లాసులో పచ్చటి ద్రవాన్ని పోసుకుని వచ్చి 'రామారావ్.. ఇది త్రాగిచూడు నీ బాధ తెలియకుండా ఉంటుంది' అన్నారట. అప్పుడు రామారావుగారు, 'ఇది నొప్పులు తగ్గించే మందా?' అంటే ఆయన 'శరీర బాధలేకాదు, మానసిక బాధలు కూడా తగ్గించే మత్తుమందు తీసుకో' అన్నారట. అందుకు రామారావుగారు స్పందిస్తూ 'నాగయ్యగారూ! నా శరీరంలో చెయ్యేకాదు - అవయవాలన్నీ విరిగినా ఈ మందు మాత్రం ముట్టను. ఇది తాగి నా జీవితాన్నే పెద్ద నొప్పిగా తయారుచేసుకోలేను' అన్న మాటలకు నాగయ్యగారు భుజం తట్టి - 'శభాష్ నిగ్రహపరుడివి. బాగా పైకి వస్తావ్ నాయనా!' అని ఆశీర్వదించారని రామారావుగారు స్వయంగా చెప్పారు.

"మనిషికి జయం కలగాలంటే దానివెనుక ఎంతో కృషి ఉండాలి. అది ఊరికే కూర్చుంటే రాదు - రాత్రింబవళ్ళు కష్టపడి దాన్ని వెతుక్కోవాలి. ఈరోజు ఇంత నటుడినైనానంటే, దాని వెనక ఎంత తపస్సుందో ఆలోచించుకోండి" అని రామారావుగారు అనేవారు. సినిమాల్లో నటించటమే ఆయనకు ప్రధాన ఉద్దేశ్యం కాదు. ప్రతిపాత్ర సమాజానికి ఆదర్శవంతమైందిగా ఉండాలని కోరుకునేవారు. ఆ ప్రభావం కొంతమంది మీదయినా చూపిస్తే వారిలో మార్పు వస్తే నటుడిగా తన జన్మ ధన్యమవుతుందనే ఆయన భావన. అందుకే పాత్ర నచ్చితేనే నటించటానికంగీకరించేవారు. ప్రతిపాత్రను ముందు బాగా అర్థం చేసికొని స్వరూప స్వభావాదులనవగాహన చేసుకుని లీనమై నటించేవారు.

అలాగే చిత్ర విజయం సమిష్టి కృషి ఫలితం అని బాగా నమ్మేవారు. అందువల్లే ఏ నిర్మాతనయినా మొదట సాంకేతిక నిపుణులు (టెక్నీషియన్స్) గురించి చెప్పమనేవారు. నచ్చిన దర్శకుడు, సాంకేతిక నిపుణులు అంటే తనతో సమభావనతో వ్యవహరించేవారున్నారా అని విచారించి చూసేవారు. తరువాతే కథ గురించి. అంత ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారు కనుకనే వారి ప్రతిసినిమా విజయవంతమైంది. చిత్రాల్లో కంటే ముందు నాటకాల్లో నటించారు కనుక ఆ సమిష్టి బాధ్యత పట్ల దృష్టి అంత గట్టిగా ఉండేది. అలాగే పాత్ర స్వభావాన్ని కూడా ముందుగా స్పష్టంగా అవగాహన ఏర్పరచుకునే అభ్యాసం వచ్చింది. అందులో తనదైన బాణి కొట్టొచ్చినట్టు కనిపించేది. "మంచి నటుడికి ఏ పాత్రయినా ఒకటే" అనేది వారి అభిప్రాయం అందుకే 'పిచ్చిపుల్లయ్య'లాటి వికారమైన పాత్ర ధరించారు. దొంగగా, బిచ్చగాడిగా, తాగుబోతుగా, అవిటివాడుగా ఏ పాత్రలు ఆయన ధరించినా వాటికి జీవం పోసారు. అటువైపు మూర్తీభవించిన పురుష శ్రేష్ఠుడైన విజయుడి పాత్రనుండి ఆడతనం ఉట్టిపడే బృహన్నల పాత్రకూడా నటించి వయ్యారాలు ఒలకబోసారు.

నటించతగిన పాత్రలు, నటించకూడని పాత్రలు, నటించవీలుకాని పాత్రలను అన్నిటిని ఎన్నుకుని, నటన విసిరిన సవాళ్ళను అత్యంత సమర్థతతో ఎదుర్కొని, ఎడతెగని, కృషితో, నిరంతర దీక్షతో పాత్రలకు ఊపిరిపోసి సజీవనటుడిగా మిగిలిపోయారు. తెలుగు సినిమా గురించి ముందుమాట వ్రాయకుండా, మధ్య మాటలేకుండా, ముగింపు ఇవ్వకుండా రాయడం అసాధ్యమవుతుంది. అలాటి చరిత్ర అసంపూర్ణమవుతుంది.

రామారావుగారిలో మహానటుడేకాదు, మంచి మానవతావాది ఉన్నాడు. ప్రజలకు కష్టాలు వస్తే, నాయకులే కాదు ఏ రంగంలో ఉన్నవారయినా ఆదుకోవచ్చని నిరూపించిన ఆదర్శమానవతామూర్తి. రామారావుగారికి ఐదేళ్ళ వయసప్పుడు గాంధీగారి జాతీయోద్యమం తీవ్రంగా సాగుతున్న రోజులు. జాతీయ నిధిని బాగా పోగుచేయాలని గాంధీగారు ఆంధ్రప్రదేశ్‌లో 215 గ్రామాలు తిరిగి జోలెపట్టారు. నిజంగా ప్రతి ఒక్కరిలో దేశభక్తి వెల్లువగా పొంగి ధనప్రాణాలు సంతోషంగా అర్పిస్తున్నారు. గాంధీగారి జోలెలో వాళ్ళేం వేస్తున్నారో తెలియటంలేదు. అణువణువున పొంగిన దేశభక్తితో చేతి ఉంగరాలు, చెవిపోగులు, మెళ్ళో హారాలు, వాటితోపాటు, స్త్రీ అన్నింటికంటే ప్రధానంగా కాపాడుకునే ఐదోతనానికి చిహ్నమైన మంగళసూత్రాలు కూడా వేశారు. మళ్ళీ అదే దృశ్యం 1952లో పాతికేళ్ళ తర్వాత రాయలసీమ కరువుకోసం జోలెపట్టిన రామారావుగారికి పునరావృతమయింది. వర్షాలు లేక పొలాలు ఎండిపోయాయి. గుక్కెడు నీళ్ళు లేక ప్రజలు అల్లాడిపోతుంటే "ఇందులో మనిషి చేయగలిగిందేముంది. ప్రకృతిని శాసించలేముగా - బలవత్తరమైన దైవమే మేలుచేయాలి కనుక పూజలు చేయండి" అని ఆనాటి పాలకులు, నాయకులు ప్రకటనలిచ్చి తమవరకు బాధ్యతలను తెలివిగా తప్పించుకోవడానికి ప్రయత్నించిన తరుణంలో రామారావుగారు ముందుకు వచ్చి "మనిషికి సాయపడవలసింది సాటి మనిషే తప్ప, కనిపించని దేవుడు కాదు, ఇవి అసమర్థప్రలాపాలు. రండి. సాటి సోదరులను ఆదుకుందాం." అని పిలుపునిచ్చి సినిమారంగాన్నంతా కదిలించి ప్రజల మధ్యకు తెచ్చారు. మొదటిసారి సినిమా ఆకాశంలో ఎవ్వరికీ కనపడని దూరంలో తళుక్కుమనే తారలు రామారావుగారి వెంట జనసముద్రంలో అడుగుపెట్టారు. ప్రజల ఆనందానికి పట్టపగ్గాలు లేవు. సామాన్యుల్లా తమతో కలిసిపోతున్న తమ తమ ఆరాధ్య నటులు జోలెపట్టి ముందుకు వస్తే స్పందించని తెలుగు గుండె లేదు. తారకరాముని జోలెతో పాటు, మిగిలిన కళాకారుల జోలెలు కూడా నిండాయి.

వికలాంగులు సైతం, తమతో దాచుకున్నది ఇచ్చేసారు. ఆడవాళ్ళయితే తారక రాముణ్ణి చూసి మైమరిచారు. సాక్షాత్తూ శ్రీకృష్ణుడు దిగివచ్చినట్టుగా భావించి, ముక్కనత్తుల దగ్గరనుండి మంగళసూత్రాల వరకు అర్పించుకుని ఆనందించారు. దాదాపు ఆ రోజుల్లోనే ఒక లక్షా యాభైవేల రూపాయల విరాళాలు వసూలు చేసి ప్రభుత్వానికి అందించారు. ఆ సమయంలోనే కోట్ల విజయభాస్కరరెడ్డిగారు మంచి మిత్రులయ్యారు.

1965లో మరోసారి పాకిస్తాన్ భారతదేశం మీదకి దురాక్రమణ చేసినప్పుడు "నేషనల్ డిఫెన్స్ ఫండ్" కోసం దాదాపు పది లక్షల రూపాయల నిధి వసూలు చేసి అప్పటి ప్రధానమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రిగారికి సమర్పించి తన దేశభక్తిని చాటుకున్నారు. మొదట పెదవి విరిచిన వారే పరిస్థితిని అర్థం చేసుకుని రామారావుగారికి సహకరించారు. అలాగే 1977 దివిసీమ ఉప్పెన స్మశానాన్ని మిగిల్చినప్పుడు వారి సహాయార్థం 'ఆంధ్రా సైక్లోన్ రిలీఫ్ ఫండ్'కు పదిహేను లక్షల రూపాయల నిధిని సేకరించి బాధితులను ఆదుకున్నారు.

ఆయన నటనే కాక సాటి మనుష్యుల కష్టాలను అర్థం చేసుకుని స్పందించే మంచి మనసును కూడా ప్రజలు గుర్తించగలిగారు. అందుకే నోరారా 'అన్నయ్యా' అని పిల్చుకోగలిగారు. ఏ నటుడికీ లేని విధంగా ఆంధ్రరాష్ట్రంలో 600 అభిమాన సంఘాలూ వారికి ఏర్పడ్డాయి. కళారంగంలో కళామతల్లి ముద్దుబిడ్డగా వెలిగారు. ఆ సేవాస్ఫూర్తితోనే మరింతగా ప్రజాసేవ చేయాలని, కళారంగం వదిలి ప్రజారంగంలో కాలూని అక్కడా తొమ్మిది నెలల్లో ప్రభుత్వాన్ని ఏర్పరచి అంతర్జాతీయ స్థాయిలో రికార్డు స్థాపించారు. ఒక్క మాటలో చెప్పాలంటే సంపూర్ణ మానవుడు ఆయన. జీవిత వైకుంఠపాళిలో నిచ్చెనలే ఎక్కి పరమపద సోపానాన్ని అందుకుని ఆదర్శమానవుడుగా, అన్నగా, పేదల పెన్నిధిగా తెలుగు తేజంగా, శాశ్వతంగా తెలుగు వారి గుండెల్లో ఉండిపోయారు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments